మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్. నర్సింగరావు

పిహెచ్‌సి వైద్యుల సమ్మెబాట

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమ్మె బాట పట్టారు. దీంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందక గ్రామీణ ప్రాంత ప్రజలు అల్లాడిపోతున్నారు. సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం తమకేమీ ఎరగనట్లు వ్యవహరిస్తోంది. తమ కనీస సమస్యలు పరిష్కరించాలని వైద్యులు కోరుతున్నారు. తమ నిరసన ప్రజలపై కాదని ప్రభుత్వ నిర్లక్ష్యంపైనే అని వారు అంటున్నారు. ఈ నేపథ్యంలో వారు తమ నిరసన కార్యాచరణను ప్రకటించారు. 26న ప్రభుత్వానికి ఆన్ లైన్ ద్వారా అందజేయాల్సిన రిపోర్టులను బంద్ చేశారు. 27న 104 సంచార చికిత్స సేవలు బంద్ చేయడం 29న ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల్లో ఓపి సేవలను నిలిపివేసి కేవలం అత్యవసర సేవలు మాత్రమే చూసే విధంగా కార్యాచరణ రూపొందించుకున్నారు. ఈనెల 30న అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టి అప్పటికి ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకపోతే అక్టోబర్ మూడవ తేదీ నుంచి విజయవాడలో నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టడానికి వైద్యులు సిద్ధమయ్యారు.

ప్రజాశక్తి-హిందూపురం

- సమస్యలు పరిష్కరించాలంటున్న డాక్టర్లు
- నిరసన కార్యక్రమాలపై కార్యాచరణ ప్రకటన
- వైద్య సేవలు అందక అల్లాడుతున్న గ్రామీణులు

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పిహెచ్‌సి వైద్యులు

పాలకులు మారినా.. ప్రభుత్వాలు మారినా విద్య... వైద్య సేవల్లో నిర్లక్ష్యం కొనసాగుతూనే ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలడంతో సగటున ఇంటికొక్కరు జ్వరంతో మంచం పట్టారు. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని మెరుగైన వైద్య సేవలను అందించే విధంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యుల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలుమార్లు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తో పాటు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినప్పటికీ వారి సమస్యలను పరిష్కరించడంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో వీధి లేని పరిస్థితుల్లో పిహెచ్‌సిల్లో పనిచేసే వైద్యులు సమ్మెబాట పట్టారు. అనంతపురం జిల్లా వ్యాప్తంగా 50, సత్యసాయి జిల్లా వ్యాప్తంగా 47 ఆరోగ్య ఉప కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యులందరూ ఏకతాటిపైకి వచ్చి ఈనెల 26వ తేదీ నుంచి సమ్మె బాట పట్టారు. తమ నిరసన కార్యక్రమాల్లో భాగంగా 26న ప్రభుత్వానికి ఆన్ లైన్ ద్వారా అందజేయాల్సిన రిపోర్టులను బంద్ చేశారు. దీంతోపాటు 104 సంచార చికిత్స సేవలు బంద్ చేయడం 29న ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల్లో ఓపి సేవలను నిలిపివేసి కేవలం అత్యవసర సేవలు మాత్రమే చూసే విధంగా కార్యాచరణ రూపొందించుకున్నారు. ఈనెల 30న అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టి అప్పటికి ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకపోతే అక్టోబర్ మూడవ తేదీ నుంచి విజయవాడలో నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టడానికి వైద్యులు సిద్ధమయ్యారు.

ముఖ్యంగా జీవో నెంబర్ 99 తీసుకొచ్చి రద్దు చేసిన ఇన్ సర్వీస్ పీజీ కోటాను పునరుద్ధించాలని డాక్టర్లు ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నప్పటికీ ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఇన్ సర్వీస్ పీజీ కోటాను పునరుద్ధించాలని, టైం బంద్ ప్రమోషన్లు అమలు చేయాలని, గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వైద్యులకు బేసిక్ పే 30శాతం, ట్రైబల్ అలవెన్స్, నేటివిటీ అండ్ అర్బన్ ఎలిజిబిలిటీ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతోపాటు వైద్యులకు ఖచ్చితమైన పనిగంటలు, వారాంతపు సెలవులు, స్పష్టమైన జాబ్ కార్డు ఇవ్వడం, నాన్ మెడికల్ వ్యక్తులు ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలను పరిశీలన చేయకుండా మార్గదర్శకాలు విడుదల చేయాలని వైద్యులు కోరుతున్నారు. కరోనా విపత్కర సమయంలో సైతం వెనకడుగు వేయకుండా ప్రజలకు వైద్య సేవలను అందించిన వైద్యుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని వారు అంటున్నారు.

డిఎంహెచ్‌ఒకు వినతిపత్రం అందజేస్తున్న పిహెచ్‌సి వైద్యులు

వైద్యానికి దూరమవుతున్న గ్రామీణ ప్రాంత ప్రజలు

ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యులు సమ్మెబాట పట్టడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు వైద్యానికి దూరమవుతున్నారు. ఇప్పటికే వాతావరణంలో తీవ్ర మార్పులు రావడంతో ఇంటికొకరు జ్వరాల బారిన పడ్డారు. ఒక్కొక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు చొప్పున వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం వీరందరూ సోమవారం నుంచి విధులను బహిష్కరించి, కేవలం అత్యవసర సేవలు మాత్రమే చూస్తామని ప్రకటించారు. దీంతో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల్లో వైద్య సేవలు అందక రోగులు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే సమ్మె

ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యుల సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఏమాత్రం స్పందన లేదు. వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆందోళన చేస్తున్నాం. ఈ నిరసన ప్రజలపై కాదు, ప్రభుత్వ నిర్లక్ష్యం పైనే.

డాక్టర్ దిలీప్,
ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా నాయకులు

హక్కుల సాధనకు ఐక్యపోరాటాలు

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు
ఘనంగా సిఐటియు అనంతపురం11వ జిల్లా మహాసభలు ప్రారంభం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కార్మిక రాజ్యం స్థాపనతోనే సమాజానికి రక్షణ ఉంటుందని అది సాధించడమే లక్ష్యంగా కార్మిక వర్గం ముందుకు సాగాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. సిఐటియు 11వ జిల్లా మహాసభలు అనంతపురం జిల్లా కేంద్రంలోని సాయినగర్ ఆపిల్ ఫంక్షన్‌హాల్, కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రాంగణంలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి అనంతపురం మున్సిపల్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీతారాం ఏచూరి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సిఐటియు జెండాను సిఐటియు సీనియర్ నాయకులు ఏజీ.రాజమోహన్ ఆవిష్కరించారు. అనంతరం సిఐటియు ఆఫీస్ బేరర్స్ ఎం.నాగమణి, సాకే నాగరాజు, శ్రీనివాసులు అధ్యక్షతన ప్రతినిధుల సభ నిర్వహించారు. ఇటీవల మృతి చెందిన నాయకులు, కార్యకర్తలు, కార్మికులకు సంతాప తీర్మాణాన్ని కమిటీ సభ్యులు గోపాల్ ప్రవేశపెట్టగా సభలో ప్రతినిధులు నివాళి అర్పించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో కార్మికుల హక్కులు హరించబడుతున్నాయని అన్నారు. సంపద సృష్టికర్తలైన కార్మికులను ప్రోత్సహించాల్సింది పోయి పెట్టుబడిదారులకు దాసోహమై లేబర్‌కోడ్‌లు తీసుకొచ్చి కార్మికుల హక్కులను హరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్రిటీష్ పాలనలో కూడా నిత్యావసర వస్తువులపై సుంకాలు వేయలేదని సంపన్నులకు మాత్రమే విధించే వారని అన్నారు. ప్రధానమంత్రి పిపిపి విధానంతో పేదరికం లేకుండా చేస్తానంటూనే మరింత పేదరికంలోకి నెట్టివేసే విధానాలు అనుసరిస్తున్నాడని విమర్శించారు.ఆశాలు, అంగన్‌వాడీలు, మున్సిపల్, గ్రామ పంచాయతీ కార్మికులు కనీస సదుపాయాలు పొందుతున్నారంటే కార్మిక వర్గం పోరాడి సాధించుకున్నవే అని గుర్తు చేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణ కాకుండా కార్మికులు పోరాడి నిలబెట్టారని తెలిపారు. ఇప్పుడు కొత్తగా 13 గంటల పని విధానం అమలు చేయడానికి రాష్ట్ర అసెంబ్లీలో తీర్మాణించడం కార్మిక లోకానికి నష్టదాయకమన్నారు. ఈ విధానాన్ని ఉప సంహరించుకోవాలన్నారు. 8 గంటల పని విధానం, కార్మికులకు కనీస వేతనాలు, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజేషన్, ఉచిత విద్య, వైద్యం అమలు తదితర డిమాండ్ల సాధన కోసం ఐక్య ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. డిసెంబర్ 31, జనవరి 1,2,3,4 తేదీల్లో విశాఖపట్టణంలో సిఐటియు అఖిలభారత మహాసభలు జరుగనున్నాయని భవిష్యత్ పోరాట కార్యాచరణ అందులో రూపొందిస్తామని అన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టి వివరించారు. కార్మికుల హక్కుల సాధనకు భవిష్యత్ పోరాటాలకు ఈ రెండు రోజుల మహాసభల్లో కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. మినిట్స్ కమిటీ సభ్యులుగా గోపాల్, రమాదేవి, శివప్రసాద్, అర్హతల కమిటీ సభ్యులుగా శకుంతల, ఆర్వి నాయుడు, నరసింహారెడ్డి తమ బాధ్యతలను నిర్వర్తించారు ఈ మహాసభలకు మద్దతుగా కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.బాల రంగయ్య, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఎం.నాగమణి, ఆఫీస్ బేరర్స్ ఆర్‌వి.నాయుడు, ముర్తుజా, వెంకటనారాయణ, గోపాల్, రామాంజినేయులు, రమాదేవి, శకుంతల, నాగభూషణ, జగన్‌మోహన్, శివప్రసాద్, నాగరాజు, శ్రీనివాసులు, సాకే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామం యూనిట్‌గా పంట కోత ప్రయోగాలు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

జిల్లా వ్యాప్తంగా గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని పంటకోత ప్రయోగాలు నిర్వహించాలని జిల్లా వ్యవసాయ అధికారి వి.రాముదాయక్, సిపిఒ కె.విజయకుమార్ సిబ్బందిని ఆదేశించారు. ఈ అంశంపై శనివారం పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఒక రోజు జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో డివైఎస్ఒ శ్రీనివాస్‌నాయక్ మొబైల్ యాప్, డిజిటల్ ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. అధికారులు మాట్లాడుతూ కంది పంటలో బీమా గ్రామాన్ని యూనిట్‌గా తీసుకోవాలని, 141 యూనిట్‌గా 720 పంటకోత ప్రయోగాలు చేపట్టాలని సూచించారు. 10 బై 10 మీటర్ల కంది పంట ప్రయోగం నిర్వహించాలని వ్యవసాయ గణాంక ఎన్ఎస్ఎస్ఒ, ఎఐసి అధికారుల పర్యవేక్షణలో దిగుబడి నిర్ధారిస్తామని తెలిపారు. మొబైల్ యాప్ ద్వారా సబ్‌మిట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి చంద్రశేఖర్, ఎపిఎంఐపి పిడి సుదర్శన్, డివిజన్ స్థాయి ఎడిఎ, మండల స్థాయి ఎఎస్ఒలు, ఎఇఒలు, ఎంఎఒలు, హెచ్ఒలు, మండల స్థాయి అధికారులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లోర్‌బాల్ క్రీడాకారిణికి చేయూత

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

క్రీడాకారిణిని అభినందిస్తున్న దృశ్యం

పట్టణంలోని సంజయ్‌నగర్ బిఎస్ఆర్ బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని రోహిణి అంతర్జాతీయ ఫ్లోర్ బాల్ పోటీలకు ఎంపికైంది. రోహిణి ఇటీవల జాతీయ స్థాయిలో ప్రథమ స్థానం సాధించి సింగపూర్‌లో జరిగే అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. దీంతో రోహిణిని శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వాల్మీకి ఉద్యోగ సంఘం నాయకులు సన్మానించి రూ. 54,616 నగదును ఆమె తల్లిదండ్రులకు అందజేశారు. వాల్మీకి ఉద్యోగుల సంఘం నాయకులు ఈశ్వరయ్య, ముత్యాలప్ప, రామకృష్ణ, నరసింహులు మాట్లాడుతూ రోహిణి అంతర్జాతీయ స్థాయిలో పోటీకు ఎంపిక కావడం గర్వించదగ్గ విషయమని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రామ్‌ప్రసాద్, రాజశేఖర్, నాగరాజు, చంద్రశేఖర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

వేగవంతంగా జిఎస్‌టి ఛాంపియన్స్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ : కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలో క్షేత్రస్థాయిలో జీఎస్టీ అమలు పరచడానికి ఛాంపియన్స్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అధికారులకు సూచనలు జారీ చేసినట్లు శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కలెక్టర్ తెలిపారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అమలులో భాగంగా ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు రిజిస్ట్రేషన్ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. జిల్లా జీఎస్టీ కోఆర్డినేటర్ గా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఉంటారన్నారు. జేసీ ఆధ్వర్యంలో జిల్లా, అసెంబ్లీ, మండల స్థాయి కోఆర్డినేటర్ల రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుందన్నారు. కేంద్రం జీఎస్టీ తగ్గించడం వల్ల వస్తువుల ధరలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. తద్వారా ప్రజలకు ఆదాయం చేకూరుతుందన్నారు. ఈ విషయమై క్షేత్రస్థాయిలో సామాన్యుడికి అర్థం అయ్యేవిధంగా అవగాహన కల్పించాల్సి ఉంటుందన్నారు. గ్రామ వార్డు సచివాలయాల స్థాయి వరకు రిజిస్ట్రేషన్ అత్యంత ప్రాధాన్యం కలిగి ఉందని వెంటనే చర్యలు తీసుకోవాలని చెప్పారు.

మృతురాలి చెవిలో కమ్మలు మాయం

స్టేషన్ లో ఫిర్యాదు చేసిన బంధువులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మానవత్వం మంట గలిసిన సంఘటన చోటుచేసుకుంది. ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందిన లక్ష్మమ్మ అనే వృద్ధురాలి చెవిలో కమ్మలు గుర్తుతెలియని దొంగలు దొంగిలించారు. మృతురాలు బంధువుల కథనం మేరకు హిందూపురం పట్టణానికి చెందిన లక్ష్మమ్మ అనే వృద్ధురాలిని అనారోగ్యంతో శుక్రవారం ఉదయం ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. వృద్ధురాలి ఆరోగ్యం విషమించడంతో అదే రోజు రాత్రి 9 గంటల సమయంలో మృతి చెందినట్లు డ్యూటీ డాక్టర్లు నిర్ధారించారు. దీంతో అక్కడే ఉన్న మృతురాలి బంధువులు విషయాన్ని తమ బంధువులకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడానికి బయటకు కొంతమంది వెళ్లగా, ఇంకొంత మంది అంబులెన్స్ వాహనం కోసం బయటకు వెళ్లారు. బయటకు వెళ్లి తిరిగి వచ్చేసరికి మృతదేహం చెవిలో ఉన్న ఓ కమ్మ సంబంధించిన చైను మాయమైనట్లు గ్రహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఎన్నడూ లేని విధంగా మృతదేహం మీద ఉన్న బంగారు దొంగిలించడం సంచలనగా మారింది. డాక్టర్లు, నర్సులు, ప్రైవేట్ సెక్యూరిటీ, చికిత్స రోగులు, రోగుల సహాయకులు ఉన్నప్పటికీ ఇతర రోగులు లేని ఓ గదిలో మృతి చెందిన వద్ధురాలు చెవిలో బంగారు దొంగిలించడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. మృతదేహం పై బంగారు దొంగిలించారంటే ఆసుపత్రిలో భద్రత ఏ విధంగా ఉందో ఇట్టే చెప్పవచ్చు. ఈ సంఘటనపై మృతురాలి బంధువులు వన్ టౌన్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ప్రకటనల్లోనే ఆర్భాటం.. ఆచరణలో విఫలం

- గంటల తరబడి రాని ఆర్టీసీ బస్సులు
- బస్టాండులో ప్రయాణికుల పడిగాపులు
- జాతరను తలపించిన కదిరి బస్టాండ్
- అధికారుల తీరుపై ఆగ్రహం

ప్రజాశక్తి - కదిరి టౌన్

రాష్ట్రవ్యాప్తంగా దసరా సెలవులు ప్రకటించడంతో వివిధ ప్రాంతాలలో చదువుకొనే యువతీ యువకులు అలాగే పండుగ సెలవులు సందర్భంగా స్వగ్రామాలకు బంధువుల ఊర్లకు వెళ్లే మహిళలురి ఇతర ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శనివారం కదిరి బస్టాండ్ లో గంటల తరబడి బస్సుల రాక కోసం ప్లాట్‌ఫాంపై నిరీక్షణ చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణం నామమాత్రమే అన్న వాదనలు మహిళ ప్రయాణికుల నుంచి వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు 15న స్వాతంత్ర్యం దినోత్సవం సందర్భంగా స్త్రీశక్తి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యాన్ని ప్రారంభించింది. ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించిన రోజున ప్రజా ప్రతినిధులు అధికారులు ప్రయాణికుల సౌకర్యార్థం బస్సులు ఏర్పాటు చేస్తామని ప్రగల్బాలు పలికారు. ఉచిత ప్రయాణం అని సకాలంలో బస్సులు నడపకుండా ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించవద్దని ప్రయాణికుల అవసరానికి తగ్గట్టు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. అయితే ఈ పథకం కార్యరూపం దాల్చి 40 రోజులు గడుస్తున్న ప్రయాణికుల రద్దీ కి అనుగుణంగా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పై ప్రయాణికుల నుండి ఆగ్రహావేశాలు వ్యక్తం అవుతున్నాయి. ఉచిత ప్రయాణానికి ముందు కదిరి డిపో పరిధిలో ప్రతి రూట్ లో 15 నిమిషాలకు ఒక్కబస్సును ఆర్టీసీ అధికారులు నడిపేవారని ప్రస్తుతం ఉచిత బస్సు ప్రయాణం అమలులోకి వచ్చాక గంటకు ఒక్క బస్సు కూడా నడపడం లేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు నడుపుతామని అటు ప్రభుత్వం ఇటు అధికారులు ఉపన్యాసాలు ఇచ్చారని ఈ పథకం ప్రారంభమై నెలన్నర రోజులు గడుస్తున్న ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవటం లేదని విమర్శిస్తున్నారు. వివిధ పట్టణాలకు మండల కేంద్రాలకు గ్రామాలకు వెళ్ళే ప్రయాణికుల రద్దీతో ఆర్టీసీ ప్రయాణికుల ప్రాంగణం తిరుణాళ్లను తలపిస్తోంది. బస్సుల రాక కోసం ప్లాట్‌ఫామ్ లో గంటల తరబడి నిలబడుతున్నామని మహిళలు, యువత వాపోతున్నారు. ఈ నేపథ్యంలో కదిరి ఆర్టీసీ బస్టాండు ప్రాంగణం శనివారం జాతరను తలపించింది. బస్సుల కోసం ప్రయాణికులు, మహిళలు, యువకులు గంటల తరబడి పడిగాపులు కాశారు. అదనపు బస్సులు ఏర్పాటు చేస్తామన్న మాటలు ఏమయ్యాయని ప్రయాణికులు అధికారులను ఈ సందర్భంగా ప్రశ్నించారు. ఒకానొక సందర్భంలో బస్సు రావడంతో బస్సులో ఎక్కే కోసం సీట్లు కోసం తీవ్ర పోటీపడి ఘర్షణకి దిగిన ఘటనలు కదిరి బస్టాండ్ లో చోటుచేసుకున్నాయి.

ప్రయాణికులతో కిక్కిరిసిన కదిరి ఆర్టీసీ బస్టాండ్

ఆర్డీటీని నిలబెట్టేరా..?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాతో పెనవేసుకున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు (ఆర్డీటీ) నిలబెడుతామని ప్రకటనలు ఈ వారంలో జోరుగా వచ్చాయి. అయితే ఈ ప్రకటనలు కార్యరూపం దాల్చాలని జిల్లావాసులు కోరుకుంటున్నారు. ఎందుకంటే ప్రజల కష్టాలు, సుఖాల్లో తోడుగా నిలుస్తున్నది ఆ సంస్థయే. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వలన దాని మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. రాబోయే రోజుల్లో యధావిధిగా ఇది కొనసాగుతుందా శాశ్వతంగా జిల్లా నుంచి కనుమరుగవుతుందా అన్న ఆందోళన సామాన్యుల్లో ఉంది. ఈ కారణంగానే గత వారంలో పెద్దఎత్తున కలెక్టరేట్ ఎదుట ధర్నాకు ప్రజలు తరలొచ్చారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ సమావేశాల్లో ఆర్డీటీ ఎఫ్‌ఆర్‌సిఎ పునరుద్ధరణ చేపట్టాలని ఎమ్మెల్యేలు ప్రస్తావించారు. దీనిపై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కూడా స్పందించారు. ఆర్డీటీ సేవలు యధావిధిగా కొనసాగుతాయని హామీ కూడా ఇచ్చారు. అయితే ఇది రాష్ట్రం చేతుల్లో లేదన్న విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం దీన్ని పునరుద్ధరించాల్సి ఉంది. అయితే కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థలకు విదేశీ విరాళాల రాకపై అడ్డుకట్ట వేసే విధంగా నిర్ణయాలు తీసుకుంటూ ఉంది. ఈ క్రమంలోనే ఆర్డీటీపైనా వేటు వేసింది. పాత లైసెన్సు అయితే రద్దయినట్టేనని అధికారపార్టీ నేతలు కూడా చెబుతున్నారు. అయితే ఇక్కడి డిమాండ్ రీత్యా కొత్తగా ఆ సంస్థకు లైసెన్సును జారీ చేయనున్నట్టు ప్రకటిస్తున్నారు. ఇది ఎంత వరకు సాధ్యమన్నది ప్రశ్నార్థకంగా ఉంది. ఈ నేపథ్యంలో దీనిపై విపక్షాలు పోరాటానికి సిద్ధమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చొరవ చూపి ఆర్డీటీని పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. కూటమిలో టిడిపి భాగస్వామిగా ఉన్నందున చర్యలు తీసుకుకోవాలని బిజెపిపై ఒత్తిడి చేయాలన్న డిమాండ్ ప్రధానంగా ఉంది. పార్టీలకు అతీతంగా ఉద్యమించేందుకు కార్యాచరణ కూడా సిద్ధమైంది. ఇక ఈ వారంలో ముందుకొచ్చిన అంశాలు చూస్తే తిరిగి జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొనే పరిస్థితులున్నాయి. ఇదే సమయంలో ప్రభుత్వం ఈ రంగాన్ని పెద్దగా పట్టించుకోవడం లేదన్న విమర్శలు రాజకీయంగా నడుస్తున్నాయి. ఇప్పటి వరకు ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీకి చర్యలు తీసుకోలేదు. సెప్టెంబరులో ఆరంభంలో మంచి వర్షాలు పడి పదును అయినా ప్రత్యామ్నాయ విత్తనాలివ్వకపోవడంతో పంటల సాగు ఆశించినంత జరగలేదు. రబీ సాగు పరిస్థితి కూడా అయోమయంగానే ఉంది. ఇంకా యూరియా సమస్యలు అక్కడక్కడ కొనసాగుతూనే ఉన్నాయి. తగినంత అందుబాటులో లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని పంటలకు సరైన గిట్టుబాటు ధర ఉండటం లేదు. మొక్కజొన్న పంట నూర్పిడి దశకు వచ్చింది. పంట చేతికొచ్చాక ధర అమాంతంగా పడిపోయింది. ఒక వైపు టమోట ధర తగ్గుతుండగా, మరోవైపు ఉల్లి ధర పడిపోయింది. తాజాగా అరటి పంటకు కూడా ధరలేదని రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మద్దతు ధర కల్పించాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. కొర్రపాడులోని సంక్షేమ వసతిగృహంలో పాలల్లో పడి 17 నెలల చిన్నారి మృతి చెందిన విషాదకర ఘటన ఈ వారంలో చోటు చేసుకుంది. అంతక మునుపు గుత్తిలోనూ ఒక ఉద్యోగి రాత్రి విధుల్లో ఉండగా బాలుడు గొంతులో వాటర్ బాటిల్ మూత పెట్టుకుని చనిపోయిన ఘటన చోటు చేసుకుంది. వరుసగా ఇవి జరగడం శోచనీయం.

కోర్టుకు నూతన భవనాలు మంజూరు చేయించాలని వినతి

పరిపాలనా న్యాయమూర్తికి సమస్యలను వివరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురంలో న్యాయస్థానాల నిర్వహణ ప్రస్తుతం రెండు చోట్ల నిర్వహిస్తుండడంతో అటు న్యాయమూర్తులు, ఇటు న్యాయవాదులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఉమ్మడి అనంత పురం జిల్లా పరిపాలనా న్యాయమూర్తి రామకృష్ణ ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. శనివారం అనంతపురం వచ్చిన పరిపాలనా న్యాయమూర్తిని బార్ అసోసియేషన్ అధ్యక్షులు వన్నేరప్ప, న్యాయవాదులు ఇందాద్, శివశంకర్ కలిసి సమస్యలను వివరించారు. ప్రధానంగా పాత జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానం భవనాన్ని ఇప్పటికే కూలదోసేందుకు అనుమతి ఇవ్వడం జరిగిందని అయితే సంబంధిత అధికారులు ఈ విషయంలో తీవ్ర జాప్యం చేస్తున్నట్టు న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లగా పరిశీలిస్తామని ఆయన తెలిపారని అసోసియేషన్ నాయకులు తెలిపారు. ముఖ్యంగా పాత అదనపు జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానం గత 1966 లో నిర్మించడం జరిగిందని, ప్రస్తుతం ఆ భవన సముదాయంలోని ఉపఖజానా, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, తహశీల్దార్ కార్యాలయం వంటి కార్యాల యాలను నిర్వహిస్తామని, అయితే కోర్టు భవనం మాత్రమే మార్పు చేశారని వివరించామన్నారు. ఈ భవనాన్ని స్మారక భవనంగా ఉపయోగించుకుంటామని, మరమ్మతులు చేయించేందుకు అనుమతించాలని కోరగా పరిపాలన న్యాయమూర్తి సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. అలాగే ప్రస్తుతం రెండుచోట్ల న్యాయస్థానాల నిర్వహణ కష్టతరమవుతుందని, దీని దృష్టిలో ఉంచుకొని త్వరితగతిన నూతన భవనాల మంజూరుకు సహకరించాలని కోరగా అన్ని అంశాలను పరిశీలించి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని పరిపాలన న్యాయమూర్తి తెలియజేసినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు అధ్యక్షులు వన్నేరువప్ప వివరించారు.

నిబంధనలు అతిక్రమిస్తే పీడీ యాక్ట్

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

తూమకుంట చెక్ పోస్టులో రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్

ప్రజాశక్తి-హిందూపురం

నిబంధనలకు అతిక్రమించి వ్యవహరించే వ్యక్తులపై పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేయాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఆదేశించారు. ఈ మేరకు అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్, ఎక్సైజ్ సిఐ లక్ష్మీ దుర్గయ్య తదితరులతో కలసి ఆయన సరిహద్దు చెక్ పోస్ట్ లతోపాటు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ లో పలు రికార్డులను పరిశీలించి పెండింగ్ కేసులను, మద్యం అక్రమ రవాణా కేసులలో పట్టుబడిన వాహనాలు త్వరగా క్లియర్ చేయాలని ఆదేశించారు. కల్లు దుకాణాల నుండి కల్లు శాంపిల్స్ సేకరించి చిత్తూరు ప్రయోగశాలకు పరీక్షల నిమిత్తం పంపించాలన్నారు. కల్తీ కల్లు అరికట్టేలా కల్లు అమ్మకదారులకు కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించారు. కర్నాటక మద్యం అక్రమ రవాణా దారుల మీద కేసులు నమోదు చేసి, పాత నిందితులు, అనుమానితులను బైండోవర్ చేయాలన్నారు. రెండు అంతకుమించి ఒక వ్యక్తి మీద ఎక్కువ కేసులు నమోదైతే పీడీ యాక్ట్ నమోదు చేయాలని ఆదేశించారు. ఎక్కువ కేసులు కల్గిన వ్యక్తుల మీద జిల్లా బహిష్కరణ చర్యలు చేపట్టాలని తెలిపారు. పరారులో ఉన్న నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని ఆదేశించారు. దసరా పండుగ, గాంధీ జయంతి సందర్భంగా అదనపు బలగాలతో గస్తీ నిర్వహించాలని పేర్కొన్నారు. అలాగే మిథనాల్ యూనిట్లను ఆకస్మిక తనిఖీ చేశారు. ఇందులో భాగంగా హిందూపురం మండలం తూముకుంట చెక్ పోస్ట్ లో వాహనాలు తనిఖీ నిర్వహించి సిబ్బందికి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు రివార్డ్, ప్రశంసా పత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పంట పొలంలో వాలిన విద్యుత్ స్తంభం

పొలంలో వాలిన విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని పి.కొత్తపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల పక్కనే నల్లూరు గ్రామానికి వెళ్లే దారిలో రైతు గొంచి వెంకటరమణప్ప పొలంలో విద్యుత్ స్తంభం ఓ వైపు వాలి ఉంది. దీంతో ఆ పొలం లో పంట వేయడానికి, వ్యవసాయ పనులు చేపట్టడానికి సమస్యగా మారిందని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని రైతు భయాందోళనకు గురవుతున్నట్లు తెలిపారు. కావున విద్యుత్ అధికారులు స్పందించి ఆ స్తంభాన్ని సరి చేయాలని, రైతు వ్యవసాయ పనులు సజావుగా సాగేలా సహకరించాలని రైతు కోరారు.

డ్రైయినేజీని పరిశీలిస్తున్న అధికారులు

మురుగునీటి కాలువ పరిశీలన

ప్రజాశక్తి-నంబులపూలకుంట

స్థానిక కల్లంగడి బజారులో కొద్దిపాటి వర్షానికే నీరు నిలవడంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడ్డారు. దీంతో శనివారం ఎంపిడిఒ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. రోడ్డుపై నిలిచిన ఉన్న నీటిని తొలగించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. నీరు ముందుకు వెళ్లకుండా కొందరు మట్టిని అడ్డుగా వేయడంతోనే నిల్వ ఉన్న విషయాన్ని అధికారులు గమనించారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డి మాధవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమేష్, జూనియర్ అసిస్టెంట్ సురేష్‌బాబు, జడ్పిటిసి కెపి.అంజనప్ప నాయుడు పాల్గొన్నారు.



జైపాల్ రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

గ్రామ కార్యదర్శుల సంఘం అధ్యక్షులుగా జైపాల్‌రెడ్డి

గోరంట్ల : మండలంలోని మందలపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి జైపాల్‌రెడ్డిని గ్రామ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో శనివారం జైపాల్‌రెడ్డిని సింగిల్ విండో అధ్యక్షులు గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ప్రభాకర్, చలపతి, లక్ష్మీనారాయణ రెడ్డి పూలమాలలు, శాలువాలతో సన్మానించారు

బిసిల సమస్యలపై సమావేశం

ధర్మవరం రూరల్ : బిసిల సమస్యలపై ఈ నెల 29వ తేదీ పుట్టపర్తిలో జరిగే సమావేశాన్ని జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎన్జీవో కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ వర్గంలో దాదాపు 143 కులాలు ఉన్నాయన్నారు. గత స్థానిక ఎన్నికల్లో బిసిలకు కేటాయించిన స్థానాలను తగ్గించడం వల్ల బిసిలు పదవులు కోల్పోయారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బిసిల జపం చేస్తుందే కానీ కులగణన చేపట్టడానికి ఎందుకు ముందుకు రాలేదని ప్రశ్నించారు. సమావేశానికి సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ, సిడబ్ల్యుసి మెంబర్ రఘు వీరారెడ్డి హాజరవుతారని తెలిపారు.

మాజీ మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన వైసిపి మండల కన్వీనర్

నల్లచెరువు : మాజీ మంత్రి, వైసిపి రీజినల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని శనివారం ఆ పార్టీ మండల కన్వీనర్ మండెం రవికుమార్‌రెడ్డి పుంగనూరు నియోజకవర్గం సదుం మండలం ఎర్రాతివారిపల్లి గ్రామంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులపై కాసేపు చర్చించారు.



పెద్దిరెడ్డిని కలిసిన వైసిపి మండల కన్వీనర్ రవి

దళిత వార్డుల అభివృద్ధికి చర్యలు : మున్సిపల్ ఛైర్మన్

దళిత వార్డులో సమస్యలు తెలుసుకొంటున్న ఛైర్మన్, కమిషనర్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మున్సిపల్ పరిధిలోని దళిత వార్డులను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పేర్కొన్నారు. శనివారం హిందూపురం పట్టణంలోని దళిత వార్డులైన ఇందిరా నగర్, ఎన్టీఆర్ కాలనీ, శ్రీకంఠపురం, ఫళనీనగర్ ప్రాంతాల్లో వారు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీ సబ్ ప్లాన్ కింద హిందూపురం మున్సిపాలిటీకి రూ.2కోట్లు విడుదల చేశారన్నారు. ఈ నిధులతో దళితవాడల్లో అన్ని సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్, కౌన్సిలర్లు సతీష్ కుమార్, గిరీష్ కుమార్, టీడీపీ నాయకులు వెంకటేష్ రెడ్డి, మోదా శివ, వెంకట నారాయణ, టైలర్ గంగాధర్, మహేష్, ఏఈ. జనార్ధన్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి ఇన్‌ఛార్జిపై బాలయ్య అభిమానుల ఫిర్యాదు

మక్బూల్‌అహ్మద్‌పై ఫిర్యాదు చేస్తున్న బాలయ్య అభిమానులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

సినీనటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణపై నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి మక్బూల్‌అహ్మద్ అనుచిత వ్యాఖ్యలు చేయడం పై స్థానిక టిడిపి నాయకులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే మక్బూల్ అహ్మద్‌పై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్ మీడియాతో మాట్లాడుతూ మక్బూల్‌అహ్మద్ ఎమ్మెల్యే బాలకృష్ణపై ఆధారాలు లేకుండా అసత్య ఆరోపణలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. బాలయ్య మద్యం తాగి అసెంబ్లీకి వచ్చారని మాట్లాడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలకృష్ణను విమర్శించే స్థాయి మక్బూల్‌కు లేదన్నారు. ఆధారాలు లేని ఆరోపణలు చేయడం వైసిపికి వెన్నతో పెట్టిన విద్య అన్నారు. బాలయ్యపై అనవసరమైన విమర్శలు పునరావృతమైతే ఊరు కునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. జగన్‌కు ఉండే సైకో లక్షణాలన్నీ ఆ పార్టీ నేతలకు ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సల్మాన్‌ఖాన్, టిడిపి నాయకులు ప్రతాప్, హరి, చైతన్య, విశ్వనాథ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీవో-1793 రద్దు చేయాలి : ఆర్‌పిఎఫ్

ప్రజాశక్తి-కదిరి అర్బన్

బలిజ సామాజిక వర్గం ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా ఉన్న జీవో-1793ని వెంటనే రద్దు చేయాలని ఆర్‌పిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం ఆర్‌పిఎఫ్ కన్వీనర్ రమేష్ బాబు మాట్లాడుతూ దొమ్మర కులస్తులను గిరిజన బలిజలుగా పరిగణలోకి తీసుకోవడానికి అమలు చేసిన జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. లేకపోతే త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం నేర్పడానికి బలిజాలు ఏకమవుతామన్నారు. బలిజల కులస్తులను కించపరిచేలా ఏ పార్టీలో నిర్ణయం తీసుకున్నా వారికి గుణపాఠం చెప్పడానికి ఏకతాటిపై నడుస్తామని స్పష్టం చేశారు. జీవో-1793ను వెంటనే రద్దు చేసి దొమ్మర కులస్తులకు గిరిజన పుత్రులుగా నామకరణం చేస్తే ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు ఉండవని సూచించారు. సమావేశంలో ఆర్‌పిఎఫ్ నాయకులు ఏనుగుల రమణ, రాజా, పుల్లయ్య, హరి, సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరిస్తున్న వీరయ్య

ప్రజాశక్తి-చిలమత్తూరు

ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పిఎ వీరయ్య తెలిపారు. ఆయన శనివారం మండలంలోని శెట్టిపల్లి పంచాయతీ పరిధిలోని పెద్దనపల్లి, బీదరెడ్డిపల్లి, తిమ్మారెడ్డిపల్లి, కమ్మయ్యగారిపల్లి, శెట్టిపల్లి ఎస్సీ కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు డ్రెయినేజీలు, సీసీ రోడ్లు, పాఠశాలకు ప్రహరీ, కమ్యూనిటీ భవనం ఏర్పాటు చేయాలని విన్నవించారు. కమ్మయ్యగారిపల్లిలో రహదారి సమస్య ఉండగా పరిశీలించారు. శెట్టిపల్లిలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌లో 40 అర్జీలు అందాయి. కార్యక్రమంలో డిటి జగన్నాథ్, టిడిపి కోఆర్డినేటర్ రంగారెడ్డి, కన్వీనర్ శ్రీనివాసులు, అంజనప్ప, బేకరీ గంగాధర్, మల్లిరెడ్డి, విజయ్‌కుమార్, నందీశప్ప, నాగిరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, జనసేన నాయకులు ప్రవీణ్ పాల్గొన్నారు.

పోషకాహారం, ఆరోగ్యంపై అవగాహన

కార్యక్రమంలో పాల్గొన్న పిహెచ్‌సి వైద్యసిబ్బంది

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండలంలోని కొండగట్టుపల్లి విలేజ్ హెల్త్ క్లినిక్ ఆవరణలో శనివారం సర్పంచి ప్రభాకర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. మొలకవేముల పిహెచ్‌సి వైద్య సిబ్బంది కిశోర బాలికలు, మహిళల్లో వచ్చే వివిధ రకాల జబ్బులపై అవగాహన కల్పించారు. రక్త హీనత, పోషకాహార లోపం, క్యాన్సర్, రక్తపోటు, మధుమేహం, తదితర వ్యాధుల గురించి వివరించారు. అంగన్వాడీ టీచర్లు న్యూట్రిషన్ స్టాల్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది వేణుగోపాల్‌రెడ్డి, మంజుల, రవిశంకర్, అలివేలమ్మ, జ్యోతి, భార్గవి, శైలజ, మీనా, సుజాత, సరస్వతమ్మ, పార్వతమ్మ, హెచ్ఎం రాజేశ్వరి, కృష్ణవేణి, భాను, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

ప్రజాశక్తి-ముదిగుబ్బ

పచ్చదనం పరిశుభ్రతలో భాగంగా శనివారం తహశీల్దార్ నారాయణస్వామి, రెవెన్యూ సిబ్బంది స్థానిక మండల రెవెన్యూ కార్యాలయ పరిసరాల్లో కలుపు మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. తహశీల్దార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ ఇల్లు, కార్యాలయం, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. త్వరలో ప్లాంటేషన్ కార్యక్రమానికి ప్రణాళిక సిద్ధం చేసి, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో గ్రీన్ ప్లాంటేషన్ జరగాలని కోరారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

పట్టణంలోని శ్రీసత్యసాయి డిగ్రీ కళాశాలలో శనివారం ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఆదిశేషారెడ్డి ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎస్‌కెయూ డైరెక్టర్ ఆఫ్ ఎగ్జామినేషన్ జివి.రమణ, గవర్నమెంట్ జూనియర్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ నరసింహమూర్తి హాజరయ్యారు. ఆదిశేషారెడ్డి మాట్లాడుతూ నైతిక విలువలు, విద్యార్థులు కాలేజ్‌లో పాటించాల్సిన అంశా లను వివరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ఏఓ కేశవయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్రీసత్యసాయి డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డేలో పాల్గొన్న ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఆదిశేషారెడ్డి

శ్రీకృష్ణ అవతారంలో దర్శనమిస్తున్న నరసింహస్వామి

శ్రీకృష్ణ అవతారంలో నరసింహస్వామి

కదిరి అర్బన్ : ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆరో రోజైన శనివారం కదిరి లక్ష్మీనరసింహస్వామి శ్రీకృష్ణ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమానికి జొన్న వీరశేషయ్య, జొన్న వీరయ్య, వారి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఉదయం నుంచి స్వామివారికి ఆనవాయితీగా హోమాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ప్రధాన అర్చకులు పార్థసారథి, ఈవో శ్రీనివాసులురెడ్డి, ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.

గుర్రం జాషువాకు నివాళి

ధర్మవరం రూరల్ : గుర్రం జాషువా సేవలు మరువలేనివని రిటైర్డ్ తెలుగు పండిట్ జయసింహ కొనియాడారు. గుర్రం జాషువా జయంతి సందర్భంగా శనివారం పట్టణంలో ఆయనకు నివాళులర్పించారు. జయసింహ మాట్లాడుతూ జాషువా సేవలను కొనియాడారు. కవులందరూ గుర్రం జాషువాను ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలని సూచించారు.

'చెత్త నుంచి సంపద'పై అవగాహన

నల్లచెరువు : నల్లచెరువులోని చెత్త నుంచి సంపద కేంద్రం వద్ద శనివారం సిఆర్‌పిలకు చెత్త నుంచి సంపద తయారు చేసే విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచి పంచరత్నమ్మ, డిఎల్‌డిఒ వెంకటరత్నం, ఎంపిడిఒ రామకృష్ణ, డిపిఆర్‌సి సిబ్బంది విశ్వనాథ రెడ్డి, సుధాకర్, డిప్యూటీ ఎంపిడిఒ రాజశేఖర్, పంచాయతీ సెక్రటరీలు నరేష్‌కుమార్, ఆంజనేయులు, ఏడు మండలాల, సిఆర్‌పిలు, గ్రామపంచాయతీ హరిత రాయబారులు పాల్గొన్నారు.

'చెత్త నుంచి సంపద'పై అవగాహన కల్పిస్తున్న అధికారి

బైక్‌లు ఢీ.. బాలుడికి గాయాలు

ధర్మవరం రూరల్ : రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడం తో 12 ఏళ్ల బాలుడు తీవ్రంగా గాయపడిన సంఘ టన శనివారం పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్‌లో చోటుచేసుకుంది. ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా పట్టణంలోని లింగిశెట్టిపాలెం వీధికి చెందిన ఓబులేసు కుమారుడు నితిన్ లిఫ్ట్ అడిగాడు. వారు కళాజ్యోతి సర్కిల్‌కునే సమయంలో ఉన్నఫళంగా మరో ద్విచక్ర వాహనదారుడు వీరిని ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో బైక్‌పై వెనుక కూర్చున్న నితిన్ ఎగిరి రోడ్డుపై పడ్డాడు. గమనించిన స్థానికులు హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చగా వైద్యులు చికిత్స చేశారు. బాలుడు అపస్మారక స్థితిలో ఉన్నారని వైద్యులు తెలపడంతో బాలుడు కుటుంబ సభ్యులు నితిన్‌ను మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని వన్ టౌన్ పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి..

ముదిగుబ్బ : కదిరి-అనంతపురం రహదారిపై శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని జొన్నల కొత్తపల్లి గ్రామానికి చెందిన అరవింద్ తీవ్రంగా గాయపడ్డాడు. అరవింద్ తన ద్విచక్ర వాహనంపై ముదిగుబ్బ నుంచి స్వగ్రామం వెళ్తుండగా అదే సమయంలో ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను తప్పించబోయి పక్కనే వెళ్తున్న ఐచర్ వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అరవింద్ తీవ్రంగా గాయపడడంతో వెంటనే ఆసుపత్రికి తరలించారు.

జాతీయ రహదారిపై వెలగని దీపాలు

ముదిగుబ్బ : స్థానిక పంగల్ రోడ్డులో మలుపు వద్ద విద్యుత్ దీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రి వేళ చీకటిలో జాతీయ రహదారిపై ఎటు వెళ్లాలో తెలియక వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు ప్రమాదాలు కూడా జరిగే అవకాశం ఉందని, సంబంధిత అధికారులు చొరవ చూపి విద్యుత్ దీపాలు సరి చేసి వెలిగేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యకర జీవితం

సమావేశంలో మాట్లాడుతున్న సిడిపిఒ సరస్వతి

ప్రజాశక్తి-బత్తలపల్లి

నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ రోగాల బారిన పడి ఇబ్బందులు పడుతున్నారని, రోగాల బారిన పడకుండా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలని సిడిపిఒ సరస్వతి సూచించారు. మండలంలోని కోడేకండ్ల గ్రామంలో శనివారం సూపర్వైజర్ చంద్రమ్మ అధ్యక్షతన పోషణ మాసోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సిడిపిఒ సరస్వతి మాట్లాడుతూ మనం తినే ఆహారంలో ఉప్పు, చక్కెర తక్కువగా వాడాలని, చిరుతిండ్లు, జంక్ ఫుడ్ తగ్గిస్తే ఆరోగ్యం మెరుగుపడి వ్యాధులు దరిచేరవన్నారు. అలాగే బిపి, షుగర్, ఒబెసిటీ బారిన పడకుండా ఉంటారని తెలిపారు. అనంతరం అంగన్వాడీ సెంటర్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సఖి సెంటర్ ఉమాదేవి, పారా మెడికల్ జ్యోతి, అంగన్వాడీ జిల్లా కోఆర్డినేటర్ లక్ష్మీదేవి, అంగన్వాడీ వర్కర్లు, గర్భిణులు, బాలింతలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు 'దసరా కానుక'

కార్మికులకు 'దసరా కానుక' అందజేస్తున్న కూటమి నాయకులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

సోమందేపల్లి మేజర్ పంచాయతీలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు శనివారం కూటమి నాయకుల ఆధ్వర్యంలో దసరా కానుక పంపిణీ చేశారు. అందులో భాగంగా కార్మికులకు అవసరమైన చెప్పులు, దుస్తులు, నూనెలు, గ్లౌజ్‌లు, తదితర వస్తువులు అందజేశారు. నాయకులు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు ఎంత సాయం చేసినా అది తక్కువే అవుతుందని, వారి సేవలు వెలకట్టలేనివ న్నారు. పట్టణ ప్రజలు పారిశుద్ధ్య కార్మికుల పట్ల గౌరవ మర్యాదలతో మెలగాలని, వారికి అవసరమైన సహాయ, సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ నర్సింగరావు, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు, టిడిపి మండల కన్వీనర్ వెంకటేష్, నగర కార్పొరేషన్ ఛైర్మన్ వెంకటరమణ, పార్లమెంట్ కార్యదర్శి నీరుగంటి చంద్ర, టౌన్ కన్వీనర్ వడ్డే సూరి, నాయకులు కిష్టప్ప, బాబయ్య, జనసేన మండల కన్వీనర్ జబీవుల్లా, రంగనగోపాల్, మద్దిలేటి పాల్గొన్నారు.

గాండ్లపెంటను యోగివేమన మండలంగా మార్చాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే కందికుంట

అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి టౌన్ : గాండ్లపెంటను యోగివేమన మండలంగా మార్చాలని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ అసెంబ్లీలో విన్నవించారు. శాసన సభ సమావేశాల్లో భాగంగా శనివారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించారు. ప్రధానంగా గాండ్లపెంట మండలంలో ప్రఖ్యాత కవి, తత్వవేత్త, యోగి వేమన సమాధి ఉందన్నారు. పుణ్యక్షేత్రం, టూరిజం హరిత రిసార్ట్ ఉన్నందువల్ల టూరిజం హబ్‌గా ఏర్పాటు చేయాలన్నారు. మండల ప్రజల కోరిక మేరకు గాండ్లపెంటను యోగి వేమన మండలంగా పేరు మార్చాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

కదిరిలో మెగా వైద్య శిబిరం

కదిరి టౌన్ : బెంగళూరులోని వైదేహి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో శనివారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల ఆవరణలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి హాజరైన వారికి వైదేహి ఆసుపత్రి వైద్య బృందం ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మాత్రలు అందజేశారు. ఈ బృందం కదిరికి రావడానికి కృషి చేసిన సాధిక్, గంగాధర్‌కు పట్టణ ప్రజలు ధన్యవా దాలు తెలిపారు. కార్యక్రమంలో రామ్మోహన్, నబిరసూల్, రమేష్‌బాబు, రామకృష్ణ, శ్రీనివాసులు, రిహానా, జనార్ధన, షేక్షావలి, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి బిఎస్ఎన్ఎల్ 4జి సేవలు

కదిరి టౌన్ : తనకల్లు మండలంలోని యర్రచేరుపల్లి గ్రామంలో బిఎస్ఎన్ఎల్ 4జి టవర్‌ను ప్రారంభించారు. దీని ద్వారా బిఎస్ఎన్ఎల్ అనంతపూర్ బిజినెస్ ఏరియా లైవ్ కవర్ చేసే ఏర్పాట్లు చేశారు. తద్వారా ఇకపై వినియోగదారులకు 4జి సేవలు అందుబాటులోకి రానున్నాయి. అనంతపూర్ టెలికాం బిజినెస్ ఏరియా ప్రధాన జెనరల్ మేనేజర్ ముజిబ్ పాషా అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచి చిన్నప్పరెడ్డి, డి.బాలగంగాధర్‌రెడ్డి, డిప్యూటీ జనరల్ మేనేజర్, డివిజినల్ ఇంజినీర్లు అబ్దుల్ బాసిత్, వి.బి.సుబ్రహ్మణ్యం, రవి కుమార్, లక్ష్మీరాయణ, మేనేజర్ రిజ్వాన్, పృథ్వీరాజ్, స్థానిక బిఎస్ఎన్ఎల్ ఫ్రాంచైజీ నాగరాజా ఏజెన్సీస్ యజమానులు, బిఎస్ఎన్ఎల్ ఇంజనీర్లు శ్రీనివాసులు, నరసింహులు, జనార్ధన్, బిఎస్ఎన్ఎల్ భాగస్వాములైన టిసిఎస్ పేస్ డిజిటెక్ ప్రతినిధులు నితీష్ యాదవ్, శ్రీనివాస్, మధు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం

గుడిబండ : మండలంలోని మందలపల్లి ఎస్సీ కాలనీకి చెందిన టిడిపి కార్యకర్త హనుమంతరాయప్ప ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సింగిల్‌విండో అధ్యక్షులు మద్దనకుంటప్ప శనివారం ఆ గ్రామం వెళ్లి హనుమంతరాయప్ప కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 2వేలు అందజేశారు. మీ కుటుంబానికి టిడిపి ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

చట్టాలపై అవగాహన అవసరం

అగళిలో పౌరహక్కుల దినోత్సవంలో పాల్గొన్న అధికారులు

ప్రజాశక్తి-బుక్కపట్నం

చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహశీల్దార్ నరసింహులు సూచించారు. మండలంలోని మారాల ఎస్సీ కాలనీలో శనివారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన తహశీల్దార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హక్కులు తెలుసుకొని కుల మత విభేదాలు లేకుండా జీవించాలన్నారు. కుల వివక్షను వీడనాడాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వీఆర్వోలు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అగళి : మండలంలోని ఆలూడి గ్రామ ఎస్సీ కాలనీలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. తహశీల్దార్ సుబ్బారావు, ఆర్ఐ చంద్రశేఖర్ రావు, ఎఎస్ఐ శ్రీరాములు పాల్గొని పౌర హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. సమాజంలో అందరూ ఒక్కటే అని, అందర్నీ ఒకేలా భావించాలని సూచించారు. కులం పేరుతో దూషించినా, కించపరిచినా, వివక్షకు గురి చేసినా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జ్యోతులు

స్వామి వారికి జ్యోతులు తీసుకెళ్తున్న మహిళలు

ప్రజాశక్తి-పరిగి

మండలంలోని ఊటుకూరు గ్రామంలో శనివారం మహిళలు దీపోత్సవం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా మహిళలు నెత్తిన దీపాలు ఎత్తుకుని స్థానిక దండు మరెమ్మ దేవస్థానం నుంచి ఊరేగింపుగా వెళ్లి చిలమత్తూరు కనుమ శ్రీలక్ష్మీ నరసింహస్వామికి సమర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ వ్యాప్తంగా గ్రామస్తులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఊటుకూరు గ్రామ ప్రజలకు ఆయురారోగ్యాలు, సిరి సంపదలు కలగాలని, గ్రామంపై చల్లని చూపు ఉండాలని చిలమత్తూరు కనుమ శ్రీలక్ష్మీనరసింహ స్వామికి జ్యోతుల ఉత్సవం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ఏటా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని, ఈ ఏడాది కూడా గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఊటుకూరు పంచాయతీ వ్యాప్తంగా మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్మార్ట్‌కార్డులతో రేషన్ పంపిణీలో అక్రమాలకు చెక్

సోమందేపల్లిలో స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ

ధర్మవరంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న చిలకం

ప్రజాశక్తి-సోమందేపల్లి

ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలను అరికట్టేందుకే కూటమి ప్రభుత్వం నూతనంగా స్మార్ట్ రేషన్ కార్డులు తీసుకొచ్చిందని కూటమి పార్టీల నాయకులు తెలిపారు. మండలంలోని పందిపర్తి, గుడిపల్లి, మాగేచెరువు, బ్రాహ్మణపల్లి, వినాయకనగర్, తదితర ప్రాంతాల్లో శనివారం కూటమి నాయకుల ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. నాయకులు మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డులు తీసుకురావడం పరిపాలనలో పారదర్శకతకు చిహ్నం అన్నారు. ఈ కార్డుల వల్ల అర్హులకు మాత్రమే సంక్షేమ ఫలాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో నగర కార్పొరేషన్ ఛైర్మన్ వెంకటరాముడు, టిడిపి మండల కన్వీనర్ వెంకటేష్, నాయకులు నీరుగంటి చంద్ర, టౌన్ కన్వీనర్ వడ్డే సూరి, మాగేచెరువు సర్పంచి నరసింహులు, సిద్ధిలింగప్ప, జనసేన మండల కన్వీనర్ జబీఉల్లా, ఇర్ఫాన్, వెంకటరమణ, శ్రీనివాస్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ గంగాధర్, కిష్టప్ప, బాబయ్య, తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా కూటమి పాలన : 'చిలకం'

ధర్మవరం రూరల్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాజకీయ పార్టీలకు అతీతంగా సుపరిపాలన అందిస్తుందని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని యాదవవీధి, ఇందిరమ్మ కాలనీ, మండలంలోని రేగాటిపల్లిలో చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో చిలకం ముఖ్యఅతిథిగా పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు మరింత పారదర్శకంగా, వేగవంతంగా నాణ్య మైన నిత్యావసర వస్తువులు అందించడానికి ఈ స్మార్ట్ రేషన్ కార్డులు ఉపయోగపడతాయన్నారు. అర్హులైన కుటుంబానికి నేరుగా ప్రయోజనం చేరేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వైసిపి ప్రభుత్వంలో ధర్మవరంలో కబ్జాలు, రౌడీజం అధికంగా ఉండేవని, ప్రస్తుతం అలాంటి సమస్యలు లేవని స్పష్టం చేశారు. ధర్మవరంలో డ్రెయినేజీలు, రోడ్ల నిర్మాణ పనులు చేపడతామని హామీ ఇచ్చారు. రేగాటి పల్లిలో పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందిస్తున్నామన్నారు. గ్రామంలో ఎలాంటి గొడవలు పడకుండా అందరూ ఐక్యంగా ఉండి ప్రతి ఒక్కరూ గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సరితాల బాషా, డిష్ రాజు, జయరామిరెడ్డి, వెంకటరెడ్డి, సుధాకర్‌రెడ్డి, దస్తగిరి, తాతిరెడ్డి, పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ : మండలంలోని తిమ్మలాపురం, దేవరహట్టి గ్రామాల్లో టిడిపి నాయకులు భీమరాజు, చిత్రశేఖర్, వీఆర్వోలు రామప్ప, సుమిత్ర ఆధ్వర్యంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. గతంలో రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారులకు ప్రస్తుతం స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్డు లబ్ధిదారులకు ఎంతో ఉపయోగపడుతుందని, లబ్ధిదారుల కుటుంబాల్లోని మొత్తం సమాచారం ఈ కార్డులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు క్రిష్టప్ప, జయన్న, రామప్ప, రామకృష్ణ, ఈరక్యాతప్ప, జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం : స్మార్ట్ రేషన్ కార్డులతో పారదర్శకత సాధ్యమవుతుందని తహశీల్దార్ నరసింహు లు, టిడిపి మండల కన్వీనర్ మలిరెడ్డి, లైవ్ స్టాక్ కార్పొరేషన్ డైరెక్టర్ యశోద రాయుడు తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులు పంపిణీ చేశారు. వారు మాట్లాడు తూ రేషన్ సరఫరాలో పారదర్శకతను పాటించేందుకే కూటమి ప్రభుత్వం అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో స్మార్ట్ కార్డులు ప్రవేశపెట్టిందన్నారు. స్మార్ట్ కార్డు ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో టౌన్ కన్వీనర్ ఎర్రకేశప్ప, డీలర్ల సంఘం అధ్యక్షులు హరి, నాయకులు బాలు, గంగాధర్, లావణ్యగౌడ్, వెంకటరాముడు, వాజిద్, డీలర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తాడిమర్రి : మండలంలోని చిల్లకొండయ్యపల్లి గ్రామంలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కొంకా నాగార్జున ఆధ్వర్యంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ, మహిళా పోలీస్ మీనా, ఆరవేటి నారాయణస్వామి, గోపాల్‌రెడ్డి, కాటమయ్య, ప్రసాద్, తేజప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

'పోషణ ట్రాకర్'లో హాజరు తప్పనిసరి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ ట్రాకర్ యాప్‌లో హాజరు తప్పనిసరి అని, హాజరు వేయని వారిపై చర్యలు తీసుకుంటామని ఐసిడిఎస్ పిడి ప్రమీల హెచ్చరించారు. పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం వద్ద శనివారం సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పీడీ ప్రమీల మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు ప్రతిరోజూ అంగన్వాడీ కేంద్రం ప్రారంభించిన వెంటనే పోషణ ట్రాకర్ యాప్‌లో హాజరు పెట్టాలని, లేనిచో చర్యలు తప్పవన్నారు. పిల్లల బరువు, ఎత్తు కచ్చితంగా చూసి వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. తప్పులు ఉంటే సూపర్వైజర్‌తో సరిచేయించుకోవాలన్నారు. ప్రతి కేంద్రంలో మౌలిక సదుపాయాలు ఉండేలా చూసుకోవాలన్నారు. కేంద్రాల ముందు మునగ, పాలకూర, పొనగంటి, బచ్చలికూరను ఖచ్చితంగా పెంచాలన్నారు. స్థలం లేనివారు అదే భవనంలో ఉన్నవారు కుండీల్లో పెంచాలన్నారు. వంట చేసేటప్పుడు వచ్చే వేస్ట్ అంతా మొక్కలకు వేయాలన్నారు. అనంతరం వనం-మనం కార్యక్రమంలో భాగంగా కార్యాలయం ముందు మొక్కలు నాటారు. కార్యక్రమంలో పుట్టపర్తి ప్రాజెక్టు సిడిపిఒ జయంతి, సూపర్వైజర్లు సుజాత, పుష్ప, భారతి, రజిత, అంగన్వాడీ కార్యకర్తలు ఉషా, నాగమణి, సుజాత, పద్మకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం

శిక్షణ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, తదితరులు

ప్రజాశక్తి-హిందూపురం

ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల్లో ప్రజాప్రతినిధుల పాత్ర ఎంతో కీలకమైందని శిక్షకులు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్ లో కౌన్సిలర్లకు స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర సౌజన్యంతో సాహస్, వాషీ సంయుక్తంగా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణను మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్ తో పాటు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు వార్డు కౌన్సిలర్లకు పట్టణ పరిశుభ్రత, వ్యర్థ నిర్వహణ, ప్రజా ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలలో చురుకైన పాత్ర వహించాల్సిన అవసరాన్ని వివరించారు. సాహస్ ప్రతినిధులు మురళి, జెస్లిన్,అశ్విని శిక్షణ నిర్వహించి, ఘన వ్యర్థ నిర్వహణ, మూలస్థాయిలో వ్యర్థ విభజన, శానిటేషన్ మరియు పరిశుభ్రతపై అవగాహన, పౌరుల భాగస్వామ్యం పెంపు, సుస్థిర పట్టణాభివద్ధి వంటి అంశాలపై సమగ్ర వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సప్తగిరి కళాశాలలో ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి-హిందూపురం

సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్

స్థానిక సప్తగిరి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మంజునాథ్ ఆధ్వర్యంలో ప్రెషర్స్ డే వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇంటికంటే కళాశాలలో ఎక్కువ సమయం ఉంటారని, ఈ సమయంలో మంచి విద్యా బుద్ధులు నేర్చుకొని ఉన్నత స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. కళాశాల పరిపాలనాధికారి గంగిరెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు విద్యతోపాటు ఆటపాటలు ముఖ్యమన్నారు. సప్తగిరి డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ,శ్రీనాథ్ రెడ్డి, ఎంబీఏ ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి విద్యార్థులకు తగు సూచనలు చేశారు. సత్య సాయి ట్రస్టు ఇటీవల నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు జిల్లాస్థాయిలో బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-హిందూపురం

పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

హిందూపురం పట్టణంలోని ఎంజీఎం పాఠశాలలో 5వ రాష్ట్రస్థాయి కుస్తీ ఛాంపియన్‌షిప్ - 2025 పోటీలను మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్, మాజీ ఛైర్మన్ అనిల్ కుమార్, ఎమ్మెల్యే బాలకృష్ణ పిఏ బాలాజీ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రెండు రోజులపాటు జరిగే ఈ పోటీలలో పాల్గొనడానికి వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు రావడం సంతోషంగా ఉందన్నారు. ఏ ఆటలోనైనా గెలుపోటములు సహజమని, అపజయం వెనుక విజయం ఉంటుందన్న సత్యాన్ని క్రీడాకారులు గ్రహించి విజయం వైపు పయనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కుస్తీ పోటీల అసోసియేషన్ సెక్రెటరీ రమేష్, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పరిమళ, రాష్ట్ర అంగన్వాడీ కార్యదర్శి వెంకటలక్ష్మి, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, టిడిపి పట్టణ అధ్యక్షులు వెంకటేష్, నాయకులు సుమోసిన, మోదశివ, అమీన్, ఫాజిల్, భార్గవ్, పవన్, వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

మల్బరీ సాగుకు మట్టి పరీక్షలు తప్పనిసరి

ప్రజాశక్తి-హిందూపురం

పట్టు రైతులు మల్బరీ సాగు చేయడానికి ముందు మట్టి పరీక్షలను తప్పని సరిగా చేయించాలని డాక్టర్ రమ్య అన్నారు. శనివారం పట్టు గూళ్ల మార్కెట్‌లో పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో పట్టు రైతులకు నా పట్టు-నా అభిమానం లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. రమ్య రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టు పరిశ్రమ శాఖ జాయింట్ డైరెక్టర్ శోభరాణి, ఎడి రత్నం, రాష్ట్ర పట్టు అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పాల్గొన్న జట్లతో నిర్వాహకులు

క్రీడలతో మానసికోల్లాసం

ప్రజాశక్తి-హిందూపురం

క్రీడలను అభ్యసనం చేయడంవల్ల మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దఢత్వం కలుగుతుందని చారిటబుల్ ట్రస్ట్ కన్వీనర్ ఉదయ్ కుమార్ పేర్కొన్నారు. వైసిపి యువ నాయకులు మనోజ్ జూలియట్ (మింటూ) ఆధ్వర్యంలో రెండు రోజులపాటు మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించే వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ టోర్నమెంట్ లో ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు కర్నాటక జట్లతో కలుపుకుని 31 జట్లు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయ్ కుమార్ మాట్లాడుతూ, యువత విద్యతో పాటు క్రీడలు పట్ల ఆసక్తి చూపాలని సూచించారు. దసరా సెలవుల సందర్భంగా యువతను ప్రోత్సహించేందుకు టోర్నమెంట్ నిర్వహించడం పట్ల నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉమర్ ఫరూక్, శాంతరాజు, రైల్వే పోలీస్ శీనా, శ్రీరాములు, దాదా ఖలందర్, సిరాజ్, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు మహేష్, చిన్న కొండప్ప, వెంకటేష్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణేశ్వరిగా దర్శనమిచ్చిన దుర్గామాత

ప్రజాశక్తి-బత్తలపల్లి

దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా ఆరో రోజైన శనివారం స్థానిక ధర్మవరం రోడ్డులో ప్రధాన రహదారి పక్కన కొలువుదీరిన దుర్గామాత అన్నపూర్ణేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేద పండితులు మంజునాథశర్మ అమ్మవారిని అన్నపూర్ణేశ్వరి దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. బత్తలపల్లి కూడలి నుంచి అమ్మవారి మండపం వరకూ ధర్మవరం వెళ్లే రోడ్డు విద్యుత్ దీపకాంతులతో భక్తులను ఆకట్టుకుంటుంది. కార్యక్రమంలో దుర్గామాత కమిటీ సభ్యులు జక్కంపూడి వెంకటేశ్వరచౌదరి, జక్కంపూడి నాగభూషణ, ముల్లగూరు అయ్యప్ప, జొన్నగడ్డల రంగానాయుడు, ముల్లగూరు గోపాల్, జాంపుల భాస్కర్, చల్లా ఓబుళనాయుడు, జాస్తి చిట్టి, ముత్తులూరు వినయ్, ముళ్లగూరు సతీష్, లక్ష్మానాయుడు, ఈసీ చిట్టి, జాంపుల అజయ్, మంజుల రాధాకృష్ణ, ఐచర్ శ్రీనివాసులు, పల్లపోతుల శ్రీరాములు, కొమ్మినేని వెంకటేశులు,తదితరులు పాల్గొన్నారు.